# కొనుగోళ్లకు, అభివృద్ధికి మధ్య పోటీ





ఇల్లెందు: మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ, టేకులపల్లి: పార్టీలోకి ఆహ్వానిస్తున్న హరిప్రియ, టేకులపల్లి: పత్తి చెలలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ భూక్యా రాధ, నాయకులు

- నమ్మక ద్రోహులకు త్వరలోనే కనువిప్పు
- ప్రజలు ఎవరివైపో చుద్దాం
- జంప్ జిలానీలకు ప్రజలు సమాధానమిస్తారు
- ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ

ఇల్లెందు, నవంబర్ 21: కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య కొనుగోళ్లకు.. హరిప్రియా నాయక్ చేసిన అభివృద్ధికి మధ్య పోటీ జరుగుతున్నదని, ప్రజలు ఎవరి వైపు నిలబడుతారో చూడాలని ఉందని ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని 8వ వార్డులో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నాడు ఎమ్మెల్యేగా పనిచేసిన కోరం నియోజకవర్గ అభివృద్ధిపై ఎన్నడూ దృష్టిసారించలేదన్నారు. నేడు కొంతమంది బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లోకి వెళ్ళడంలో ఆంతర్యం ఏమిటో ప్రజలు ఒక్కసారి అర్థం చేసుకోవాలన్నారు.జంప్ జిలానీలకు త్వరలోనే ప్రజలు సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 2014లో మాజీ మున్సిపల్ చైర్మన్ వెంకట్‌గౌడ్ ఇల్లెందు మున్సిపాలిటీకి రూ.120 కోట్లు తీసుకువచ్చి అభివృద్ధి చేశారన్నారు. 2018లో రూ.315 కోట్లతో ఇల్లెందు మున్సిపాలిటీ అభివృద్ధికి కావాల్సిన సకల సదుపాయాలు, సౌకర్యాలు ఏర్పాటు చేసి అవార్డులు తీసుకుంటూ రాష్ట్రంలో ఆదర్శ మున్సిపాలిటీగా ఇల్లెందు పేరు ప్రఖ్యాతులు గడించిందన్నారు. నెల 30వ తేదీన జరిగే ఓటింగ్‌కు ప్రజలు ఎవరి వైపు నిలబడుతారోనని చూడాలని ఉందన్నారు. నేను కూడా పార్టీ మారానని, ఇల్లెందు నియోజకవర్గ అభివృద్ధి కోసం తాను బీఆర్ఎస్‌లోకి వచ్చానన్నారు. జడ్పీ చైర్మన్‌గా కోరం కనకయ్య, మున్సిపాలిటీ చైర్మన్‌గా దమ్మాలపాటి వెంకటేశ్వరరావులకు పదవి, గౌరవాన్ని ఇచ్చి అందలం ఎక్కిస్తే స్వార్థ రాజకీయాలకు తెరలేపడాన్ని నియోజకవర్గ ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. సీఎం కేసీఆర్ ఇల్లెందు నియోజవకర్గానికి అన్ని విధాలుగా నిధులు మంజూరు చేశారన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి పథకాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు ఓటేసి మరోసారి అభివృద్ధి చేసేందుకు అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, టీబీజీకేఎస్ నాయకుడు రంగనాథ్, వైస్ చైర్మన్ జానీపాషా, ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు నాదెండ్ల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వర్లు, నాయకులు సుధీర్‌తోత్ల, బాస శ్రీనివాస్, రేఖా రవిశంకర్, జేకే శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నమ్మక ద్రోహులకు త్వరలోనే కనువిప్పు

ఇల్లెందు రూరల్, నవంబర్ 21: బీఆర్ఎస్‌ను వీడి ఇతర పార్టీలో చేరిన నమ్మకద్రోహులకు త్వరలోనే కనువిప్పు కలుగబోతుందని బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని బొజ్జాయిగూడెం, కొల్లాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆణిముత్యాల్లాంటి చెమటోడ్చి శ్రమించి పార్టీ గెలుపు కోసం కష్టపడే కార్యకర్తలు ఉన్నంత వరకు బీఆర్ఎస్‌ను ఎవరూ ఓడించలేరన్నారు. బీఆర్ఎస్‌తోనే సంక్షేమ పథకాలు, అభివృద్ధి సాధ్యమన్నారు. కొంతమంది పార్టీ నుంచి వెళ్లినంత మాత్రానా పార్టీకి నష్టం లేదన్నారు. గ్రామాల్లో అడుగడుగునా ఆమెకు ప్రజలు, అభిమానులు నీరాజనాలు పలుకుతున్నారు. ఇతర పార్టీలకు చెందిన కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరడంతో బీఆర్ఎస్ కుటుంబం మరింతగా పెరిగిందన్నారు. అందరి బాధ్యత తనపై ఉందని, తన విజయానికి కృషి చేసిన ఎవరిని మరిచిపోనన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మండల అధ్యక్షుడు శీలం రమేశ్, పట్టణ అధ్యక్షుడు నాదెండ్ల శ్రీనివాస్‌రెడ్డి, టీబీజీకేఎస్ నాయకుడు రంగనాథ్, కోఆప్షన్ సభ్యుడు ఘాజీ, కొల్లాపురం యంగ్‌స్టార్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

టేకులపల్లి, నవంబర్ 21: మండలంలోని బిల్లుడుతండా గ్రామ పంచాయతీ జెండాలతండా గ్రామానికి చెందిన 20మంది కాంగ్రెస్ పార్టీ నుంచి స్థానిక సర్పంచ్ అజ్మీరా గలక సమక్షంలో మంగళవారం హరిప్రియానాయక్‌ను కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలో చేరిన వారు ఇల్లందులో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. మండలంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్, ఉపాధ్యక్షుడు చీమల సత్యనారాయణ, బిల్లుడుతండా ఉప లాకావత్ రవి, పార్టీలో చేరిన వారు భూక్యా బాలు, మోతిలాల్, సురేశ్, బావ్‌సింగ్, అనిల్‌కుమార్, బాలు, మంగ్య, అజ్మీర బాలు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### టేకులపల్లి మండలంలో..

టేకులపల్లి, నవంబర్ 21: ఇల్లెందు నియోజకవర్గ అభ్యర్థి బానోత్ హరిప్రియ గెలుపు కోసం మండలంలో పలు గ్రామాలలో ఎంపీపీ భూక్యా రాధ, సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. మంగళవారం టేకులపల్లి మండలలో బోడు, రామచంద్రునిపేట, మొక్కంపాడు, పెట్రాంచెలక గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఆమ్మెడ రేణుక ఆధ్వర్యంలో కొత్తతండా, రాంపురం, దుబ్బతండా, తావుర్యతండా, లక్ష్మీపురం గ్రామాల్లో ప్రచారం జోరుగా నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి హరిప్రియను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.



ఇల్లెందు రూరల్: ప్రచారం చేస్తున్న హరిప్రియ



ఇల్లెందు: ర్యాలీలో పాల్గొన్న ప్రజలు



టేకులపల్లి: ప్రచారం చేస్తున్న మహిళలు

## హరిప్రియ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి

టేకులపల్లి, నవంబర్ 21: ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మండల ఎన్నికల ఇన్‌చార్జి, కామెపల్లి జడ్పీటీసీ బానోత్ వెంకట ప్రవీణ్‌నాయక్ అన్నారు. మంగళవారం టేకులపల్లిలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇంటింటికెళ్లి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యేగా హరిప్రియ చేసిన పనులను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని, బీఆర్ఎస్ మ్యానిఫెస్టో గురించి వివరించాలని సూచించారు. అదేవిధంగా ఓటు హక్కు వినియోగంపై ఈవీఎంపై 5వ నెంబర్‌పై ఉన్న కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు అవగాన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్, బోడ బాలునాయక్, నాయకులు బానోత్ రామానాయక్, బానోత్ కిషన్‌నాయక్, దళపల్లి శ్రీనివాసరాజు, చీమల సత్యనారాయణ, భూక్యా బాలకృష్ణ, జాలది అప్పారావు, మాలోత్ పూల్‌సింగ్‌నాయక్, ధారవత్ బాలాజీ, మౌలన, బానోత్ రవికుమార్, భూక్యా రాజా, కుమ్మరి కిరణ్, చీమల రామకృష్ణ, గంగారపు రమేశ్, జర్పుల లచ్చునాయక్, మాలోత్ భీముడు, హనుమంతు పాల్గొన్నారు.



ఈవీఎంల గురించి వివరిస్తున్న ప్రవీణ్‌నాయక్

## ఇంటి వద్దనే ఓటు వేసే విధానం పరిశీలన

టేకులపల్లి, నవంబర్ 21: భారత ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు వయో వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద ఓటు వినియోగించుకునే విధానాన్ని మంగళవారం టేకులపల్లి లో జనరల్ అబ్జర్వర్ ఎస్ హరికిశోర్ పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో మొత్తం వయోవృద్ధులు 29మంది, దివ్యాంగులు 10మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగానికి అర్హులన్నారు. వారిలో మంగళవారం 13 మంది వయోవృద్ధులు, నలుగురు వికలాంగులు ఓటును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో గణేశ్ గాంధీ, పంచాయతీ కార్యదర్శి కిరణబిచ్చు పాల్గొన్నారు.



ఓటు విధానాన్ని పరిశీలిస్తున్న జనరల్ అబ్జర్వర్ హరికిశోర్


## ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): పాల్వంచలోని అనుబోస్ కళాశాలలో చేపట్టనున్న ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల మంగళవారం సందర్శించారు. ఓట్ల లెక్కింపునకు చేపట్టాల్సిన కట్టుదిట్టమైన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు కౌంటింగ్ కేంద్రాల్లో ఐరన్ మెస్ ఏర్పాటు చేయాలని, కేంద్రంలోకి వాహనాలకు అనుమతి లేదని, ఆరుబయట నిర్దేశించిన ప్రదేశంలో వాహనాలు పార్కింగ్ చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ భీమ్లా, సర్వే ఏడీ కుసుమకుమారి పాల్గొన్నారు.

## పోలింగ్ ప్రక్రియకు కట్టుదిట్టమైన చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా, సక్రమంగా జరిగేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ మాట్లాడారు. కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ ఓటర్లకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నూతన ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

## సీపీఐ నుంచి బీఆర్ఎస్‌కు వలస



గులాబీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ వద్దిరాజు

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 21: చుంచుపల్లి మండల పరిధిలోని బాబూక్యాంప్ సర్పంచ్, సీపీఐ నేత గుగులోత్ బాబూరావుతో పాటు ఎనిమిది మంది వార్డుమెంబర్లు, ఆ పార్టీ నేతలు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ కొత్తగూడెం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

## ట్రాన్స్‌జెండర్లకు ఓటుపై అవగాహన

కొత్తగూడెం టౌన్, నవంబర్ 21: ట్రాన్స్‌జెండర్ ఓటర్లకు రెండోవిడత అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం కొత్తగూడెంలోని సెక్యూర్ ఎన్‌జీవో కార్యాలయంలో నిర్వహించారు. దివ్యాంగుల జిల్లా నోడల్ అధికారి స్వర్ణలత లెనీనా మాట్లాడుతూ సెప్టెంబర్ 26న ట్రాన్స్‌జెండర్లకు కలెక్టరేట్‌లో మొదటిసారిగా అవగాహన కల్పించి కొత్తగా ఓటు నమోదుకు అవకాశం కల్పించామని తెలిపారు. ప్రతి ఓటరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు.